క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే



వర్ధన్నపేట: హైదరాబాద్ హయత్‌నగర్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేను అందించి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట హన్మకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాం నర్సింహారెడ్డి, అనిమిరెడ్డి కృష్ణారెడ్డి ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నర్సంపేట : పట్టణంలోని ది న్యూ మాంటిస్సోరి పాఠశాలలో నూతన క్యాలెండర్‌ను శనివారం పాఠశాల చైర్మన్, డైరెక్టర్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, ఊర్మిళ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుంభం రాజా పాపిరెడ్డి, కుంభం రజనిపాపిరెడ్డి, సామ్యూల్ మోరిస్, సారంగం, బోనగిరి సుధాకర్, ప్రవీణ్, జయలక్ష్మి, లావణ్య, మమత, మాధవి, చైతన్య, శృతి, సుస్మిత, మౌనిక, హారిక, సరిత, శ్రీనివాస్, విజేందర్ పాల్గొన్నారు.

కేజీబీవీలో వైద్య శిబిరం

దుగ్గొండి : మండలంలోని మల్లంపల్లిలోని కేజీబీవీ విద్యాలయంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. 400 మంది బాలికలకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ రాకేష్, భరత్‌కుమార్ మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా స్థానికంగా పాఠశాలలో ఉండే ఏఎన్‌ఎంకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజుల, టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత



పర్వతగిరి : మండలంలోని ఏనుగల్లులో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి జేడీ ఫౌండేషన్ బృందం పుస్తకాలను అందజేసింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ జేడీ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు శనివారం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కవితరెడ్డి గ్రంథాలయానికి పుస్తకాలను అందజేసింది. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి గుగులోతు యాకుబ్‌నాయక్, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దీకొండ నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

విచక్షణారహితంగా ఎరువులు వాడొద్దు

ఖానాపురం : రైతులు విచక్షణ రహితంగా ఎరువులు వాడొద్దని వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్నకు నాలుగు బస్తాల యూరియాను, వరి పంటలో వంద కిలోల యూరియాను నాలుగు దఫాలుగా వాడుకోవాలని సూచించారు. ఎక్కువ మోతాదులో యూరియా వాడినట్లయితే రైతులకు పంట పెట్టుబడులు ఎక్కువ అవుతాయని పేర్కొన్నారు. చీడ, పీడలు ఆశిస్తే వాటి నివారణకు మందులను పిచికారి చేయాల్సి వస్తుందన్నారు. రైతులు పంట కాలానికి సంబంధించి మొత్తం ఎరువులు ఒకేసారి కొనుగోలు చేయొద్దని సూచించారు.

అన్నదాతకు అండగా మోదీ సర్కారు

రాయపర్తి : రైతులకు మోదీ సర్కార్ నూతన సంవత్సర కానుకగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఆర్థికసాయాన్ని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచడం హర్షణీయమని శక్తికేంద్రం అధ్యక్షుడు నిమ్మల అనిల్ అన్నారు. శనివారం మండలంలోని పెర్కవేడులో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అబ్బోజు సుధాకర్, రాసాల రాకేష్, నిమ్మల నవీన్, తదితరులు పాల్గొన్నారు.

సన్నూరులో ధనుర్మాసోత్సవాలు



రాయపర్తి: మండలంలోని పురాతన సన్నూరు వెంకటేశ్వరపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాస మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదా అమ్మవారికి వికాస తరంగిణి సంస్థ వారు సారె సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజాకార్యక్రమాలను నిర్వహించారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పర్వతగిరి : మండలంలోని దౌలతనగర్ గ్రామంలోని షెడ్యూల్డ్ కులాల కాలనీలో వ్యవసాయ బావులు, బోర్లకు సరఫరా చేసే 11కేవీ విద్యుత్ లైన్లు ఆ గ్రామంలోని సుమారు 20 ఇళ్లపై నుంచి వెళ్లాయి. కాగా విద్యుత్ వైర్లు లూజుగా ఉండి వేలాడుతున్నాయి. దీంతో కాలనీవాసులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. కొద్దిరోజుల క్రితం ఒక విద్యుత్ వైరు తెగి కింద పడింది. ఈ విషయంపై కాలనీవాసులు అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో 11కేవీ విద్యుత్ వైర్లు పలు మార్లు తెగిపడ్డప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధికారులు చొరవ చూపాలి



11కేవీ విద్యుత్ వైర్లు సరిచేయాలని గతంలో పలు మార్లు అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోలేదు. విద్యుత్ ఉన్నతాధికారులు 11 కేవీ వైర్ల విషయంలో చొరవ చూపి వైర్లను సరిచేయాలి.

– బర్ల యాకయ్య, దౌలత్‌నగర్



ఇళ్లపై నుంచి వెళ్లిన 11కేవీ విద్యుత్ వైర్లు

ఒప్పందం అమలు చేయకపోవడం శోచనీయం

- ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రమేశ్

నర్సంపేట : సివిల్ సప్లయిస్ కార్మికులతో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయకపోవడం శోచనీయమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్ అన్నారు. పట్టణంలోని సివిల్ సప్లయిస్ గోదాం ఎదుట సివిల్ సప్లయిస్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం నాల్గో రోజుకు చేరింది. ఈ సందర్భంగా రమేశ్, సివిల్ సప్లయిస్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్‌లు మద్దతు తెలుపగా కార్మికులు మోకాళ్లపై నిరసన తెలిపారు. అనంతరం అయన మాట్లాడుతూ పెరిగిన రేట్ల జీఓ అమలు చేయకపోవడం వెనుక మతలబు ఏంటో అర్థం కావడం లేదన్నారు. ఈనెల 6న రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రాష్ట్రంలోని 33 జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, నర్సింహం, కిశోర్, రవి, కుమారస్వామి, మహేందర్, వీరస్వామి, సాంబయ్య పాల్గొన్నారు.



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదాల నివారణకు స్థానిక ఎస్సై మెరుగు రాజు ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. శనివారం మండలంలోని ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు నుంచి పట్టణ చివర వరకు జాతీయ రహదారిపై ఇరువైపుల ఉన్న పలు షాపుల సైన్ బోర్డులను తొలగించాలని షాపు యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డుకు 10 అడుగుల దూరంలో మాత్రమే సైన్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని, రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు తమకు సహకరించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సురేష్, ఏలియా తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎస్సారెస్పీ కెనాల్‌లో చెట్ల పొదలు తొలగింపు

పర్వతగిరి: మండలంలోని చౌటపల్లి ఎస్సారెస్పీ కెనాల్‌లో చెట్ల పొదలను తొలగించి కూలిన మట్టిని తొలగించేందుకు శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ పనులను ప్రారంభించారు. చౌటపల్లి, గోరుగుట్టతండా, తురుకల సోమారం, గుంటూరుపల్లి, నల్లగుంటతండ, జగ్గు తండ ప్రాంతాలకు ఎస్సారెస్పీ నీటిని రైతులకు అందే విధంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో చౌటపల్లి నుంచి జగ్గుతండా, గుంటూరుపల్లి, తురుకల సోమవారం పోయే కెనాల్‌ను శాశ్వత మరమ్మతులు చేపడతామని తెలిపారు.

కష్టజీవుల రాజ్యం కోసం పోరాడుతాం

దుగ్గొండి: అమరుల స్ఫూర్తితో కష్టజీవుల రాజ్యం తేవడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తామని ఎంసీపీఐ (యూ) పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. మండలంలోని రేబల్లెకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ యాకూబ్ శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి సందర్శించి జోహార్లు అర్పించారు.పార్టీ రాష్ట్ర నాయకుడు బాబురావు, మహ్మద్ రాజాసాహెబ్, పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

చెన్నారావుపేట : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సరోజ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో శనివారం కలెక్టర్, డీఎంఅండ్ హెచ్‌ఓ ఆదేశాల మేరకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 58 విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ సరోజ మాట్లాడుతూ డెంగీ, మలేరియాతో పాటు పలు రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు.ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించినట్లు వెల్లడించారు.

యాత్రను విజయవంతం చేయాలి

చెన్నారావుపేట : తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కో కన్వీనర్ వనం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆత్మ గౌరవ యాత్ర జనవరి 19న మానుకోటలో జరుగనుందన్నారు. ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.


ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

నల్లబెల్లి : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్సై గోవర్ధన్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. అనంతరం విద్యార్థులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు.

సాయిరామ్‌కు ఘననివాళి

చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన చిరుతం సాయిరామ్ శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి మరణించిన 12 రోజులకు కుమారుడు చనిపోవడంతో మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్‌తో పాటు సంఘ సభ్యులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్నేహితుల చేయూత



వర్ధన్నపేట : తమ తోటి చిన్ననాటి స్నేహితులు బాధిత స్నేహితురాలికి 1995–96 బ్యాచ్ మిత్రులు రూ. 60 వేలు ఆర్థికసాయం అందచేసి తమ స్నేహితాన్ని చాటుకున్నారు. మండలంలోని కదారిగూడెం గ్రామానికి చెందిన దోపతి రవీందర్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శనివారం మృతుడి భార్య రజితకు ఆర్థికసాయం అందచేశారు.

సారయ్య కుటుంబానికి..

రాయపర్తి: బ్రెయిన్‌స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గాడిపెల్లి సారయ్య కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చేయూతనందించింది. ఈ విషయాన్ని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించి రూ.10వేల ఆర్థిక సాయం ఫౌండేషన్ ప్రతినిధుల చేత పంపించినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఎల్లయ్య(70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని కురుమ సంఘం నర్సంపేట డివిజన్ బాధ్యులు శనివారం పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో డివిజన్ అధ్యక్షుడు బుడగొండ భిక్షపతి, ఉపాధ్యక్షులు కోరె సుధాకర్, ఉన్నారు.


వర్ధన్నపేట : పట్టణానికి చెందిన కొండేటి సోమమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ శనివారం ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, కుమారస్వామి, తుమ్మల యాకయ్య, సోమయ్య, ఉన్నారు.

సామాజిక న్యాయానికి ఎంఎస్‌పీ ఉద్యమం



నర్సంపేట : తెలంగాణలో సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధికి మహాజన సోషలిస్టు పార్టీ ఉద్యమిస్తుందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్‌మాదిగ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం నియోజకవర్గ కో కన్వీనర్ తడుగుల విజయ్ అధ్యక్షతన ఎంఎస్‌పీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణయ్‌దీప్ ఎంఎస్‌పీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజల హక్కుల కోసం దండోరా దళపతి మందకృష్ణ ప్రజల కోసం మహాజన సోషలిస్టు పార్టీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, రాజశేఖర్, బాబురాజుయాదవ్, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి



నర్సంపేట : పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ సర్వే నంబర్ 111 ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు పంచాలని డీబీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాపర్తి జగన్నాథం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ సర్వే నంబర్ 111 ప్రభుత్వ భూమిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇళ్లు లేని దళిత నిరుపేదలు 2021లో గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

రాయపర్తి : కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి భర్త రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సోమనాథాలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, భూక్య సమ్మయ్య, పెండ్లి మహేందర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌దారులకు పూల బొకేలు అందజేత




దుగ్గొండి: రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని గిర్నిబావిలో శనివారం ఎస్సై వెంకటేశ్వర్లు వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్మెట్ ధరించి వాహనం నడుతున్న వారిని ఆపి వారికి అభినందనలు తెలుపుతూ పూల బొకేలు అందించారు. అనంతరం పూలే గురుకుల విద్యాలయంలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ ప్రయోజనాలు కల్పించాలి



నర్సంపేట : పెన్షనర్స్‌కు గ్రాడ్యూటీ, జీపీఎఫ్, జీఐఎస్, టీఎస్‌జీఎల్‌ఐ, తదితర పెన్షనరీ ప్రయోజనాలను నేటికి విడుదల చేయకపోవడం బాధాకరమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిశోజు రామ మనోహర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నర్సంపేట యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ఎస్‌టీఓ కార్యాలయంలో ఏటీఓ చంద్రకళ ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి రామమనోహర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్రు సుధీర్ బాబు, ఎస్.సదానందంలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్ అంబటి రాజెల్లును శాలువాతో సత్కరించారు. ఆర్థిక కార్యదర్శి అక్కపెల్లి శ్రీనివాస్, సభ్యులు కృష్ణమూర్తి, జిల్లా సంఘ సలహాదారు గుంటి రామచందర్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామస్వామి కుటుంబానికి అండగా ఉంటాం



నర్సంపేట రూరల్: రామస్వామి కుటుంబానికి అండగా ఉండి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రాయితీలను వచ్చే విధంగా చూస్తామని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి అన్నారు. మండలంలోని ఇటుకాలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన గౌరె రామస్వామి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా శనివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామస్వామి డీటీఎఫ్ సంఘంలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేయడంతో పాటు ఉద్యోగ ధర్మంలో వృత్తి నిబంధనలను పాటించి విద్యాభివృద్ధికి, ఎంతగానో కృషి చేశారన్నారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, హన్మకొండ అధ్యక్షుడు శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, కొమ్మాలు, దార్ల రవీందర్, కుమారస్వామి, రాజేందర్, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

నర్సంపేటలో 12న ముగ్గుల పోటీలు

- హాజరుకానున్న 300 మంది మహిళలు
- విజేతలకు బహుమతులు అందించనున్న నిర్వాహకులు

నర్సంపేట: అమ్మ జ్ఞాపకాలను పదిలపరుస్తూ ఓ యువకుడు సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్నాడు. పట్టణానికి చెందిన గోకా లీలావతి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు వినోద్–స్వప్న దంపతులు 2014లో గోకా లీలావతి ట్రస్ట్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వారు సంక్రాంతికి ముందు పట్టణంలో ముగ్గుల పోటీలతో పాటు భోగి మంటలు వేస్తున్నారు. కస్తూర్బా మహిళా మండలి సహకారంతో విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాల నుంచి రానున్న మహిళలు..

నర్సంపేట మినీ స్టేడియంలో నిర్వహించనున్న ముగ్గుల పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 300 మంది మహిళలు హాజరవుతారు. రాజకీయ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు ముగింపు వేడుకలకు రానున్నారు. వేడుకలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విజేతలకు బహుమతులు..

గోకా లీలావతి ట్రస్ట్, కస్తూర్బా మహిళా మండలి ఆధ్వర్యంలో ఈనెల 12న ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 300 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొంటారు. మొదటి బహుమతి కింద రూ.10, 116తో పాటు ట్రోఫీ అందజేస్తారు. రెండో బహుమతి రూ.5,116 చొప్పున ఇద్దరికి అందజేస్తారు. మూడో బహుమతి ముగ్గురికి రూ.3,115 చొప్పున అందజేస్తారు. కన్సోలేషన్ బహుమతి కింద 15 మందికి రూ.1,116 చొప్పున అందజేస్తారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు (ఫైల్)

అమ్మ జ్ఞాపకార్థం వేడుకలు



అమ్మ జ్ఞాపకార్థం ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్నాం. ప్రతీ సంవత్సరం మహిళలు పాల్గొని విజయవంతం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు మా ఆహ్వానాన్ని మన్నించి వేడుకల్లో పాల్గొంటున్నందుకు ధన్యవాదాలు. నా సతీమణి సహకారంతో వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నా.

– గోకా వినోద్, ట్రస్ట్ నిర్వాహకుడు

ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా అభివృద్ధి

- పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్

నర్సంపేట : ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. పట్టణంలోని వల్లభ్‌నగర్ ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరుకున్న కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచన మేరకు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో శిథిలమైన కమ్యూనిటీ హాల్ బిల్డింగ్ పట్టణ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌తో కలిసి పరిశీలించి కమ్యూనిటీ బిల్డింగ్ ప్లాస్టింగ్, కాంపౌండ్, టాయిలెట్స్, కరెంటుకు దాదాపు రూ.15లక్షల అంచనాతో ఎస్టిమేషన్ వేయించడం జరిగిందని తెలిపారు. మిషన్ భగీరథ వల్ల వార్డులో పాడైన రోడ్డును వెంటనే నిర్మాణం చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. సీనియర్ నాయకులు బీరం భరత్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శులు బిట్ల మనోహర్, మురళి, భాస్కర్‌రెడ్డి, నాగరాజు, బాలు, కృష్ణమూర్తి, సదానందం, రవికిషన్, ప్రశాంత్, భాస్కర్, మధు, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.



భవనాన్ని పరిశీలిస్తున్న రామానంద్

అవశేషాలు లేని మిర్చి పొడిని ఉపయోగించాలి

దుగ్గొండి: రసాయన హితంగా మారిన ఆహార పదార్థాలతో ప్రజలు వివిధ రకాల రోగాల బారిన పడుతున్నారని ఎలాంటి అవశేషాలు లేని మిరప పొడిని ఉపయోగించాలని రిటైర్డ్ జేడీఏ పోలుసాని శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని మల్లంపల్లికి చెందిన రైతు నాగెల్లి వీరారెడ్డి ఎలాంటి పురుగు మందులు వాడకుండా ఆర్గానిక్ పద్ధతిలో 7 ఎకరాల్లో వరంగల్ చపాట రకం మిరపతోను సాగు చేశాడు. మిరప తోటను హైదరాబాద్‌కు చెందిన మహీదర రైతు ఉత్పత్తిదారుల సంఘం బాధ్యులు శనివారం సందర్శించారు. తోటకు వాడిన ఎరువులు, పురుగు మందుల స్థానంలో రసాయన రహితంగా వాడిన మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేసిన రైతు వీరారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది పంకజ్‌రెడ్డి, పాలం రమణారెడ్డి, నాగెల్లి వాసుదేవరెడ్డి, నాగెల్లి రాజిరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.



మిరపతోను పరిశీలిస్తున్న రిటైర్డ్ జేడీఏ శ్రీనివాసరెడ్డి

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

సంగెం: విద్యుత్‌శాఖలో అన్‌మ్యాన్డ్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న కొమ్మాలు విద్యుదాఘాతంతో తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన వేల్పుల కొమ్మాలు విద్యుత్‌శాఖలో అన్‌మ్యాన్డ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. లోహిత సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పెద్దతండాకు చెందిన బాలు విధులు నిర్వహిస్తున్నాడు. సబ్‌స్టేషన్ సమీపంలోనే బాలు వ్యవసాయభూమి ఉండగా మోటార్ సర్వీస్ వైర్లు తెగిపోయాయి. దీంతో ఆపరేటర్ శుక్రవారం సాయంత్రం కొమ్మాలును పిలిపించి తెగిపోయిన సర్వీస్ వైర్లను సరిచేసి స్తంభానికి చుట్టి కనెక్షన్ ఇవ్వాలని కోరాడు. కొమ్మాలు ఎక్కిన విద్యుత్ స్తంభానికి ఎల్‌టీ లైన్, 11 కేవీలైన్ ఉన్నాయి. బాలు ఎల్‌టీ లైన్‌ను బంద్ చేసి కొమ్మాలును స్తంభం ఎక్కాలని చెప్పాడు. స్తంభం ఎక్కి సర్వీస్ వైర్లు సరిచేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి మంటలు లేచి స్తంభంపై నుంచి కొమ్మాలు కింద పడిపోయాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా ఎంజీఎంకు తరలించారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

వర్ధన్నపేట : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన డీసీ తండా పరిధిలోని బావనికుంటలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై మెరుగు రాజు తెలిపిన కథనం ప్రకారం.. వర్ధన్నపేట పట్టణ పరిధిలోని డీసీ తండా శివారు బావనికుంట తండాకు చెందిన సపావట్ నరేష్(20) డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఉన్నత చదువులు చదవడానికి ఆర్థిక స్థోమత బాగా లేక హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. పై చదువులు చదవాలనే కోరికను జీర్ణించుకోలేక మనస్తాపానికి గురయ్యేవాడు. ఈ క్రమంలో డిసెంబర్ 15న తన ఇంటికి వచ్చి ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించాడు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. శనివారం మృతుని తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బోల్లోనిపల్లిలో లారీడ్రైవర్..

నల్లబెల్లి : తాగుడుకు బానిసైన ఓ లారీడ్రైవర్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందిన ఘటన మండలంలోని బోల్లోనిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై గోవర్ధన్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోల్లోనిపల్లికి చెందిన రాగుల రమేశ్(27) లారీడ్రైవర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తుండగా నర్సింహులపేట గ్రామానికి చెందిన అమ్మి అనే యువతితో ఎనిమిదేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ప్రేమగా మారడంతో కొన్నాళ్లకు కులాంతర వివాహం చేసుకున్నారు. కొంతకాలం వీరి కాపురం సజావుగానే సాగింది. లారీడ్రైవర్‌గా పని చేస్తున్న తను తాగుడుకు బానిసకావంతో ఆరోగ్యం క్షీణించింది. డిసెంబర్ 31న మద్యం మత్తులో ఇంట్లో పడి ఉన్న అతన్ని స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులు ఎంజీఎం తరలించి చికిత్స అందించారు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

జంగాలపల్లి తండాలో యువకుడు..

నర్సంపేట రూరల్: చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. ఎస్సై గూడ అరుణ్ కథనం ప్రకారం.. జంగాలపల్లి తండాకు చెందిన భూక్యా సుమన్ (30)కు ఏడు సంవత్సరాల క్రితం మహబూబాబాద్ జిల్లా మర్రిపెడ బంగ్లాకు చెందిన కల్యాణితో వివాహం జరిగింది. వీరి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల గొడవ కావడంతో కల్యాణి పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన ఆయన ఈనెల 2న గడ్డిమందు తాగాడు. స్థానికులు వెంటనే నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.

ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన వ్యక్తి..

ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన వ్యక్తి చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందినట్లు నర్సంపేట ఎస్సై రవికుమార్ తెలిపారు. పట్టణంలోని సర్వాపురానికి చెందిన కదిరె అనిల్ (30) ఈనెల 2న ఖానాపురం వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. నర్సంపేట నుంచి భద్రాచలానికి మంచిర్యాల డిపో సూపర్‌లగ్జరీ బస్సు వెళ్తోంది. అనిల్ రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.

నక్కలగుట్ట తండాలో అగ్నిప్రమాదం

నెక్కొండ: ప్రమాదవశాత్తు విద్యాదాఘాతంతో ఓ పూరిగుడిసె దగ్ధమైన సంఘటన మండలంలోని నక్కలగుట్ట తండాలో శనివారం చోటు చేసుకుంది. తండాకు చెందిన బాదావతు వాలి వ్యవసాయ పనులకు వెళ్లింది. ఈ క్రమంలో పూరిగుడిసె ప్రమాదవశాత్తు విద్యాదాఘాతంతో మంటలు చెలరేగాయి. సుమారు రూ. 60 వేల నష్టం వాటిల్లిందని బాధితురాలు వాలి వాపోయింది.